వైభవంగా అమ్మవారి ఘటం ఊరేగింపు




భవిష్యవాణి వినిపిస్తున్న వైష్ణవి అమ్మవారి ఘటం ఊరేగింపు

డబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలిక్‌మాత ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో వైష్ణవితో భవిష్యవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యవాణిలో వైష్ణవి అమ్మవారికి ఐదు వారాల పాటు పచ్చకూరలు, పప్పు, బెల్లం, పెరుగుతో సాకలు పెట్టాలన్నారు. పోతరాజు రాము ఆరోగ్యం క్షీణించిదని తెలపగా..అమ్మవారి ఎదుట ముక్కు నేలకు రాయాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా పండుతాయని..అందరూ సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. అనంతరం అమ్మవారి ఘటాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రూప మహేందర్, రఘు, జగదీష్, నారాయణ, ఎం.కరుణాకర్, పరుశురాం, నరేందర్, నర్సింహా, రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెసిడెంట్స్ కప్ విజేతగా యువ గోల్ఫర్ విశేష్ శర్మ



గోల్కొండ: హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రతీ ఏడాదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రెసిడెంట్స్ కప్ 11వ ఎడిషన్‌లో యువ గోల్ఫర్ విశేష్ శర్మ విజేతగా నిలిచాడు. గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వేదికగా ఈ టోర్నీ జరిగింది. 400 మందికి పైగా పాల్గొన్న ఈ టోర్నీలో 17 ఏళ్ల విశేష్ అద్భుతంగా రాణించాడు. ఆడిన రెండు రౌండ్లలోనూ అందరి కంటే మెరుగ్గా పాయింట్లు సాధించి చాంపియన్‌గా నిలిచాడు. ఇదే కేటగిరీలో వేదాన్ష్ రావు తాండ్ర రన్నరప్‌గా నిలిచాడు. మహిళల విభాగంలో పద్మశ్రీ రెడ్డి విజేతగా నిలిస్తే... శ్రీహిత మాండవ రన్నరప్‌గా నిలిచారు. సీనియర్ మెన్స్ విభాగంలో కెప్టెన్ ఎంఎస్ థిల్లాన్ టైటిల్ గెలుచుకోగా.. భాస్కర్ రెడ్డి రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయంత్ ఠాగూర్, సెక్రటరీ వందిత్ రెడ్డి, ట్రెజరర్ ఉత్తమ్ సింఘల్ బహుమతులు అందజేశారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



మీరాలంమండిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నసీరుద్దీన్

చార్మినార్: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నసీరుద్దీన్ తెలిపారు. సోమవారం మీరాలంమండిలో తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాహనదారులకు ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా మీరాలం మండి మార్కెట్‌లో వాహనదారుల నుంచి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించామన్నారు. రోడ్డుకు ఇరువైపుల కొంతమంది తమతమ దుకాణాల ముందు రోడ్డు కబ్జా చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు అవాంతరాలు కలిగిస్తే చలాన్లు తప్పవన్నారు. ఆయన వెంట పీసీ రమేష్ తదితరులున్నారు.

కోల్‌కతా ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలి



కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

సుల్తాన్‌బజార్: కోల్‌కతాలో లేడీ మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు సోమవారం రాత్రి క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు మాట్లాడుతూ..దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కరువైంది. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో సరైన సెక్యూరిటీని అన్ని రాష్ట్రాల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ వారు సౌకర్యాలతో పాటు భద్రత చర్యలపై కూడా దృష్టిసారించారని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించకపోతే దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విజయ దండోర ర్యాలీకి వేలాదిగా తరలిరావాలి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుల్తాన్‌బజార్: ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టులో సాధించుకొని హైదరాబాద్ గడ్డమీద అడుగుపెడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఈటె.దర్శన్ మాదిగ అన్నారు. సోమవారం విజయ దండోర కార్యక్రమ సన్నాహాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఢిల్లీ కోటమీద విజయకేతనం ఎగరవేసిన మందకృష్ణ మాదిగ శనివారం 13న హైదరాబాద్‌కు చేరుకుంటున్న సందర్భంగా ఘన స్వాగతం నిర్వహించనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల కల అయిన ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడం స్వాగతిస్తున్నామన్నారు. ఆయన స్వాగత ర్యాలీకి పెద్ద ఎత్తున మాదిగ సోదరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎడవెల్లి యాదయ్య మాదిగ, రవికుమార్ మాదిగ, సర్వదాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ

యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నూతనగా ప్రవేశపెట్టిన ఎస్‌పీజీ గ్యాస్ మెకానికల్ కోర్సు వివరాలతో కూడిన పుస్తకాని సోమవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర్ వేణుగోపాల్ రావు, సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఎండీ కే.వేణుగోపాల్‌రావు, ఎస్‌పీజీ స్టేట్ లెవల్ కో ఆర్డినేటర్ రవీందర్ కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'అన్ని జిల్లాల్లో టీఎఫ్‌సీఓ కౌన్సెలింగ్ కేంద్రాలు ప్రారంభిస్తాం'



టీఎఫ్‌సీఓ ప్రతినిధులతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయాలు ప్రారంభిస్తామని ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆయన వివిధ జిల్లాల ప్రతినిధులతో మాట్లాడారు. తమ ఆధ్వర్యంలో జరుగుతున్న కౌన్సెలింగ్‌కు మంచి స్పందన వస్తుందని 15 ఏళ్లలో తమ వద్దకు వచ్చిన కుటుంబ తగాదాలు, దంపతుల వివాదాలను విజయవంతంగా పరిష్కరించామని ఆయన అన్నారు. సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లా కేంద్రాలలో ఇప్పటికే తమ కౌన్సెలింగ్ కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. వివిధ జిల్లాల్లో పర్యటించి అన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ కౌసిక్ అలీ, సమీర్, పర్వేజ్, ఆసీమ్ అలీ, దయానంద్ తదితరులున్నారు.

డ్రగ్స్ రహిత భారత్‌కు కృషి చేయాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి



మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

గోల్కొండ: డ్రగ్స్ రహిత భారత్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ రిసాల బజార్‌లోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ మహమ్మారిని పారదోలినట్లు డ్రగ్స్‌ను కూడా రాష్ట్రం, దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ మహమ్మారిపై ఆయన సందేశం ఇచ్చారు. పాఠశాలలో, కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం జరగకుండా అధ్యాపకులు, విద్యార్థులు కూడా చూడాలని అన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు సైతం మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనార్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల చేత డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ, డ్రగ్స్ ఫ్రీ భారత్ అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డీఈఓ ఆర్.రోహిణి, డిజెబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ రమణరాజు, డిప్యూటీ ఐవోఓఎస్ మహ్మద్ మక్బుల్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మైత్రి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు క్రిడాలో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులపై సమీక్ష

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఆర్-క్రిడా)లో ఈనెల 13, 14వ తేదీల్లో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులపై రెండు రోజుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ తెలిపారు. క్లైమెట్ స్మార్ట్ వ్యవసాయం, రియల్ టైమ్ కరువు పర్యవేక్షణ, నిర్వహణ, నీటి ఉత్పాకతను పెంపొందించడం, పంటల వేగవంతమైన పెంపకం, వరద బీమా ఉత్పత్తుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివిధ అంతర్జాతీయ ఏజెన్సీల నిధులతో దాదాపు 29 ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. ఈ సమావేశానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30 మంది పాల్గొని ప్రాజెక్టుల పురోగతిని ప్రదర్శిస్తారన్నారు.

ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ టీమ్ మేనేజర్‌గా భిక్షా



గన్‌ఫౌండ్రీ: ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ టీమ్ మేనేజర్‌గా నగరానికి చెందిన భిక్షాఖరార్ సోమవారం నియమితులయ్యారు. ఈనెల 13వ తేదీ నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు పలు దేశాల్లో జరుగనున్న వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇతను మేనేజర్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో టీమ్ మేనేజర్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటిన జీహెచ్‌ఎంసీ కమిషనర్



యాకుత్‌పురా: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సోమవారం సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారాతో కలిసి పురానీహవేలీలోని కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ ఆమ్రపాలి చీఫ్ జడ్జి తో సమావేశమయ్యరు. స్మల్ కాసెస్ కోర్టు ఛీఫ్ జడ్జి నరసింగరావు, జీహెచ్‌యంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న, చార్మినార్ సర్కిల్ డీసీ సరిత, కోర్టు బార్ ఆసోసియోషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి, ప్రధాన కార్యదర్శి దుబ్బక హర్షవర్ధన్, ఉపాధ్యాక్షురాలు ప్రవీణ రెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేష్ కుమార్, ఆధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో తిరంగా బైక్ ర్యాలీ



చార్మినార్: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం పాత బస్తీలో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఈ మేరకు సోమవారం దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాకు జాతీయ పతాకాన్ని అందజేసి తిరంగా ర్యాలీ విషయంపై చర్చించినట్లు ఆయన తెలిపారు. దారుషిపా గ్రౌండ్ నుంచి బయలు దేరే తమ తిరంగా బైక్ ర్యాలీ చార్మినార్ వరకు కొనసాగుతుందన్నారు.

వైద్యురాలి హంతకుల కేసును సీబీఐకి అప్పగించండి



మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని తెలంగాణ రాష్ట్ర దంతవైద్యుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వైద్యురాలిని దారుణంగా హత్య చేసిన నిందితుల కేసును సీబీఐకి అప్పగించాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కల్‌కత్తాలోని ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ మృతదేహాన్ని పోస్టుమార్టం చేయగా సంచలన విషయాలు బయటపడ్డాయన్నారు. ఆమెపై లైంగిక దాడి చేయడంతో పాటు హత్య చేయడం ఎంతో బాధాకరమన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో ఉరిశిక్ష వేయాలని ఆయన కోరారు. ఈ కేసును సీబీఐకి అప్పగించినప్పుడే కేసుకు న్యాయం జరుగుతుందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఎం.నరసింహస్వామి తదితరులు

చార్మినార్: 30ఏళ్లుగా చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఫలితం లభించిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చార్మినార్ ఇన్‌చార్జి ఎస్.ఎం నరసింహ్మస్వామి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అనంతరం నగరానికి తిరిగి వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలకాలని కోరుతూ సోమవారం పురానాపూల్ ఎస్సీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ సామాజికవర్గానికి చెందిన వారందరూ ఈ స్వాగత కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామవరపు శ్రీనివాస్, మక్కపల్లి సదానందం, చెన్నపాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, పౌర గ్రంథాలయ డైరెక్టర్ ఏవీఎన్ రాజుతో కలిసి పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నిజాం ఎంతో దూరదృష్టితో విద్యార్థుల సౌలభ్యం కోసం ఇక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. నేడు ఎందరో విద్యార్థులు ఇక్కడ చదువుతూ జాతీయ స్థాయిలో వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొంటూ ఉత్తీర్ణత సాధించి వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. గ్రంథాలయాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ స్థాయిలోని ఉద్యోగులకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారు ఒక కాపీ ప్రతిని తనకు అందజేయాలని ఆయన సూచించారు. షాదీముబారక్‌తో పాటు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునే వారు పథకం కోసం నిర్దేశించిన ధ్రువపత్రాలను జత చేయాలన్నారు. ఈసేవా కేంద్రాలలోనే దరఖాస్తు చేసుకోవాలని పథకాల మంజూరు కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా తన కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

877 రోజులుగా అన్నదానం



కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రతినిత్యం 200 మంది నిరుపేద రోగులకు అన్నదానం నిర్వహిస్తూ విజయవంతంగా 877 రోజులు పూర్తి చేశామని ప్రముఖ సంఘ సేవకుడు, ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహిస్తున్నామన్నారు.

కత్తితో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి రిమాండ్

గౌలిపురా: కత్తితో బెదిరించి డబ్బులు తీసుకెళ్లిన ఘటనలో మొఘల్‌పురా పోలీసులు సోమవారం ఇద్దరిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన బి.దాస్ స్థానికంగా టెంట్‌హౌజ్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. దాస్ ఇంటి పక్కనే నివాసముండే బగాది ఆకాశ్ (25) 2022లో టెంట్‌హౌజ్ సామగ్రిని అద్దెకు తీసుకొని డబ్బులు ఇవ్వలేదు. అంతేకాకుండా ఆకాశ్ మద్యం మత్తులో దాస్ ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తూ తన ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండేవాడు. ఈ నెల 10న ఆకాశ్ తన స్నేహితుడు దిలోర్ అమర్జిత్ సింగ్ రాజా (24) దాస్ టెంట్ హౌజ్‌కు వెళ్లగా..అక్కడ దాస్ సోదరుని కుమారుడు ఉండటంతో సామగ్రిని ధ్వంసం చేసి బెదిరింపులకు గురి చేశాడు. అనంతరం సోమవారం ఉదయం మరోసారి బగాది ఆకాశ్, అమర్జిత్ సింగ్ రాజాలు దాస్ ఇంటికి వచ్చి కత్తి చూపించి బెదిరింపులకు పాల్పడి రూ.500లను తీసుకెళ్లాడు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆకాశ్, అమర్జిత్ సింగ్ రాజాలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పార్వతి తల్రేజ మృతి సమాజానికి తీరని లోటు



అబిడ్స్: స్వాతంత్య్ర సమరయోధురాలు, ఉచిత వైద్య సేవకురాలు పార్వతి తల్రేజ మృతి సమాజానికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. గోషామహల్, రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలైన శాంతిదేవి తల్లి పార్వతి తల్రేజ ఇటీవల మృతి చెందింది. సోమవారం మైనంపల్లి హన్మంతరావు ఆమె నివాసంలో పార్వతి తల్రేజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా స్థానిక గోషామహల్ పరిసర ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు ఉచితంగా పార్వతి తల్రేజ ప్రతిరోజు హోమీపతి మందులు పంపిణీ చేశారని కొనియాడారు. ఎంతో మంది పేదలకు ఆమె చేసిన ఉచిత వైద్య సేవలు అమోఘమన్నారు. ప్రతిరోజూ ఆమె ఇంట్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. శాంతిదేవిని ఆయన పరామర్శించారు. ప్రేమ్‌అగర్వాల్, రాష్ట్ర నాయకులు హరికృష్ణ, నక్క ప్రభాకర్, నారాయణ, వెంకట్‌రెడ్డి, రాజు దూలపల్లి అమర్నాథ్, ఆనంద్, ధినేష్ పాల్గొన్నారు.

17 నుంచి తీగలకుంటలో ఉర్సు ఉత్సవాలు

బహదూర్‌పురా: ఈనెల 17, 18, 19 తేదీలలో తీగలకుంటలోని యూసుఫియాలో హజ్రత్ అల్లామ సయ్యదినా సూఫీ యూసుఫ్ అలీ అల్ మారూఫ్ దాదాగౌబ్ ఖలందర్ ఖిబ్లా (రహ్మా) ఉర్సు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 17న అస్ర్ నమాజ్ తర్వాత తీసుకువస్తారని, అనంతరం సంధల్ ఊరేగింపు ఉంటుందన్నారు. తాడ్‌బన్ ఖాజా పహాడి నుంచి బయలుదేరి తీగలకుంటకు చేరుకుంటుందన్నారు. 18న చిరాగ, 19న మహఫిలె సిమా కార్యక్రమాలు ఉంటాయన్నారు. హజ్రత్ సూఫీ ఆజమ్ అధ్యక్షత వహిస్తారు. సయ్యద్ షా మహమూద్ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమం మౌలానా సూఫీ అతహర్ అలీ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందన్నారు. వివరాలకు 93920 98452లో సంప్రదించవచ్చు.

నేడు 'సే నో టు డ్రగ్స్' పై అవగాహన

గోల్కొండ: మాదకద్రవ్యాల వినియోగంపై అనర్థాలు వివరించేందుకు నేడు సే నో టు డ్రగ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కన్ఫడరేషన్ ఆఫ్ మైనార్టీ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి మహ్మద్ ఇదాయత్ అలీఖాన్ తెలిపారు. కిల్‌వత్‌లోని ఉర్దు మస్కాన్ హాల్‌లో సాయంత్రం 6.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్నేహ మెహ్రా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. కన్ఫడరేషన్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఫారూఖ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు పాల్గొనవచ్చునని ఆయన సూచించారు. వివరాలకు 9391046826లో సంప్రదించవచ్చు.

15న డయాలసిస్ ప్రీమియర్ లీగ్

గోల్కొండ: డయాలసిస్‌తో బాధపడుతున్న వారు, డయాలసిస్ కేంద్రాల సిబ్బంది కోసం ఈనెల 15న డయాలసీస్ ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నామని ఉమీద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ నియాజ్ ఏ ఖాన్ తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని ఫ్లైయింగ్ గ్రావిటీ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్, టెబుల్ టెన్నీస్, క్యారమ్, చెస్, స్పూన్ రేస్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ పోటీలకు రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ శివసేనారెడ్డి, ఇండియా క్రికెట్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడి ఆత్మహత్య



ఇస్మాయిల్ హుస్సేన్ మృతదేహం

సంతోష్‌నగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన షేక్ జాఫర్ హుస్సేన్ తన కుటుంబసభ్యులతో కలిసి రేకుల ఇంట్లో నివాసముంటున్నాడు. జాఫర్ హుస్సేన్ రెండో కుమారుడు ఇస్మాయిల్ హుస్సేన్ (22) ఈ నెల 11న రాత్రి 11.40 గంటలకు కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి అందరూ కలిసి నిద్రకు ఉపక్రమించాడు. సోమవారం ఉదయం 6 గంటలకు కుటుంబసభ్యులు నిద్ర లేచి చూడగా ఇస్మాయిల్ హుస్సేన్ కనిపించలేదు. దీంతో తాము బెడ్‌రూమ్ డోర్ కొట్టి చూడగా ఎంతకీ తీయకపోవడంతో పగలగొట్టి చూడగా రేకుల రాడ్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీనిపై కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై తండ్రి షేక్ జాఫర్ హుస్సేన్ పోలీసులకు ఆర్థిక సమస్యలతో మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

నాంపల్లి: మామూలు ఇవ్వాలంటూ కర్రీ పాయింట్ యజమానిపై ఓ వ్యక్తి అతని అనుచరులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విజయనగర్ కాలనీలో నివాసం ఉండే సలీం మల్లేపల్లి అన్వర్ ఉలూం కళాశాల సమీపంలో మోయిన్ చాక్నా సెంటర్ పేరుతో ఓ కర్రీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అఫ్జల్‌సాగర్‌కు చెందిన రిజ్వాన్ మల్లేపల్లిలోని మోయిన్ కర్రీ పాయింట్ వద్దకు వచ్చారు. మామూలు విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఇరువురికి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. మామూలు ఇవ్వాల్సిందేనంటూ కత్తులను చూపించి బెదిరింపులకు పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడి మృతి



మనోహర్ రాక్రే (ఫైల్)

జియాగూడ: బీజేపీ సీనియర్ నాయకుడు మనోహర్ రాక్రే గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. జియాగూడలో ఉంటున్న మనోహర్ బీజేపీలో కార్యకర్తగా ఉంటూ కార్పొరేటర్‌గా పోటీచేశాడు. సీనియర్ బీజేపీ లీడర్‌గా కొనసాగుతున్న మనోహర్ మృతి చెందడంతో జియాగూడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మంగళవారం ఉదయం అంతిమ సంస్కారం నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా జియాగూడ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణాలు తదితరులు సంతాపం ప్రకటించారు.

జాతీయ భావాలు పెంపొందించేందుకు కృషి



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న గోపాల్‌జీ, ఉమాశంకర్

అబిడ్స్: జాతీయ భావాలు పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ పేర్కొన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని పార్టీ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌జీ మాట్లాడతూ..ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ భావాలను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఉమాశంకర్, డి.చంద్రశేఖర్, ధినేష్, రాంరెడ్డిలు పాల్గొన్నారు.